వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
బుధవారం, సెప్టెంబర్ 23, 2026

స్ట్రోక్ చికిత్సలో ఆధునిక సాంకేతికత

- మెకానికల్ థ్రాంబెక్టమీతో ప్రాణాపాయం నుంచి విముక్తి
- 'టైమ్ ఈజ్ బ్రెయిన్' సూత్రాన్ని గుర్తించాలి
- ప్రముఖ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ కె.శివరామ్ రావు



హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ : స్ట్రోక్ బారిన పడినప్పుడు ప్రతీ నిమిషం ఎంతో కీలకమని, సకాలంలో స్పందించి సరైన వైద్యం అందిస్తే ప్రాణాపాయం తప్పడమే కాకుండా శాశ్వత వైకల్యం నుంచి కాపాడుకోవచ్చని ప్రముఖ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ శివరామ్ రావు కె తెలిపారు. "టైమ్ ఈజ్ బ్రెయిన్" అనే సూత్రాన్ని ప్రతీ ఒక్కరూ గుర్తుంచుకోవాలని ఆయన సూచించారు. సికింద్రాబాద్‌లోని యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో హనుమకొండలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో స్ట్రోక్ చికిత్సలో అందుబాటులోకి వచ్చిన ఆధునిక వైద్య విధానాలపై ఆయన మాట్లాడారు.

◆ మెకానికల్ థ్రాంబెక్టమీ – ఒక విప్లవాత్మక చికిత్స

ఇటీవలి కాలంలో స్ట్రోక్ చికిత్సలో 'మెకానికల్ థ్రాంబెక్టమీ' విధానం గొప్ప విప్లవంగా మారిందని డాక్టర్ శివరామ్ రావు తెలిపారు. మెదడుకు రక్తాన్ని చేరవేసే ప్రధాన రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టినప్పుడు, క్యాథెటర్ ద్వారా ప్రత్యేక పరికరాల సహాయంతో ఆ గడ్డను సురక్షితంగా బయటకు తీస్తారని వివరించారు. దీనివల్ల మెదడుకు రక్తప్రసరణ వేగంగా పునరుద్ధరించబడుతుందన్నారు. యశోద హాస్పిటల్స్‌లో అందుబాటులో ఉన్న ఆధునిక 'బైప్లేన్ న్యూరోఇంటర్వెన్షనల్ క్యాథ్ ల్యాబ్' ద్వారా మెదడులోని రక్తనాళాలను ఒకేసారి రెండు వేర్వేరు కోణాల్లో అత్యంత స్పష్టంగా చూడవచ్చని, దీనివల్ల క్లిష్టమైన చికిత్సలను అత్యంత ఖచ్చితత్వంతో అందించవచ్చని పేర్కొన్నారు. ఇక్కడ బాధితులకు మెకానికల్ థ్రాంబెక్టమీ, కారోటిడ్ స్టెంటింగ్, మెదడు అన్యూరిజం వంటి ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. పక్షవాతం లక్షణాలను త్వరగా గుర్తించేందుకు ప్రజలు 'BE-FAST' సూత్రాన్ని గుర్తుంచుకోవాలని డాక్టర్ పిలుపునిచ్చారు. అకస్మాత్తుగా శరీర బ్యాలెన్స్ కోల్పోవడం, కంటిచూపు హఠాత్తుగా మందగించడం లేదా తగ్గడం, ముఖం ఒకవైపునకు వంగిపోవడం, చేయి లేదా కాలు బలహీనపడటం, మాట తడబడటం లేదా సరిగా రాకపోవడం, లక్షణాలు కనిపించిన వెంటనే ఆలస్యం చేయకుండా 'స్ట్రోక్ సెంటర్'కు తరలించడం. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే రోగిని సమయం వృథా చేయకుండా అర్హత కలిగిన అత్యవసర స్ట్రోక్ సెంటర్‌కు తీసుకువెళ్లడమే అత్యంత కీలకమైన చర్య అని వైద్యులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అసిస్టెంట్ మేనేజర్ యు. రాజ్ కుమార్, స్వరాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కారుపై 'ఉయ్యాల గణపతి'

ప్రత్యేక శోభాయాత్రలో బొజ్జ గణపయ్య



కాశీబుగ్గ, వాయిస్ ఆఫ్ వందే భారత్ : వరంగల్ నగరంలోని కాశీబుగ్గ ప్రాంతానికి చెందిన 'వంగరి బ్రదర్స్' వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా సరికొత్త ఆధ్యాత్మిక ప్రతిభను చాటుకున్నారు. ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా వినాయక నిమజ్జనం రోజున తమ సొంత కారుపై వినాయక విగ్రహాన్ని అత్యంత శోభాయమానంగా అలంకరించి నగర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వంగరి లక్ష్మీపతి మాట్లాడుతూ.. గత 15 సంవత్సరాలుగా తమ సొంత కారుపై వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి, ఆకర్షణీయంగా అలంకరించి శోభాయాత్ర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. ఈ సంవత్సరం ప్రత్యేకంగా కారుపై 'ఉయ్యాల గణపతి' రూపంలో వినాయకుడిని ఏర్పాటు చేయగా, ఈ శోభాయాత్ర స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో వంగరి రవి, రాజశేఖర్, రాజసమయ్య మరియు వంగరి కుటుంబ సభ్యులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



చలివాగు వద్ద నిమజ్జన ఏర్పాట్లు

పరకాల, వాయిస్ ఆఫ్ వందేభారత్ : పరకాల పట్టణ మున్సిపల్ పరిధిలోని చలివాగు వద్ద బుధవారం జరగబోయే గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పనులను మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ అధికారికంగా ప్రారంభించారు. నిమజ్జనోత్సవానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గణపతి సేవకుడు హనుమంతరావుకు సన్మానం

■ రుద్రమ నగర్ కమిటీ ఆత్మీయ సత్కారం





వరంగల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : రంగసాయిపేటలోని రుద్రమ నగర్ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గత 25 సంవత్సరాలుగా వినాయక నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తున్న కమిటీ అధ్యక్షుడు పసుపులేటి హనుమంతరావును కాలనీవాసులు, ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం ఘనంగా సన్మానించారు. రజతోత్సవం సందర్భంగా ఆయన అందించిన సేవలను కొనియాడుతూ ఈ ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ.. కాలనీవాసులను మమేకం చేస్తూ, భగవద్గీత పారాయణం, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక వికాస కార్యక్రమాలను నిరంతరం చేపడుతున్నట్లు తెలిపారు. మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి ప్రతినిత్యం పూజల్లో పాల్గొనడం, స్థానిక పురోహితులు వెలిదే నరసింహమూర్తి, ప్రభాకర్ శాస్త్రి గార్లు శాస్త్రోక్తంగా నిత్య పూజలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కాలనీవాసుల సహకారంతోనే ఈ ఆధ్యాత్మిక క్రతువును దిగ్విజయంగా నిర్వహించగలుగుతున్నానని, భవిష్యత్తులోనూ మరిన్ని మంచి కార్యక్రమాలు చేపడతానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు కర్ణ వేణుగోపాల్, కొంగరి లక్ష్మీనారాయణ, బత్తుల సుదర్శన్, కొంతం వెంకన్న, బోడ కృష్ణ, మట్టపల్లి దేవేందర్, ఆకుల మహేందర్, రాచమల్ల రాజేష్, సతీష్, పసుపులేటి పూర్ణచందర్, గుండు దిలీప్ కుమార్, పోగుల సుతేజ్, సిద్ధార్థ, కుశాల్, రాజ్ కుమార్, బోగోజు రాజేష్ పాల్గొన్నారు.

ప్రధాని మోదీ సేవలు దేశానికే గర్వకారణం

- ఎంపీ ఈటల రాజేందర్
- నాగోల్‌లో బిజెవైఎమ్ ఆధ్వర్యంలో ఘనంగా మెగా రక్తదాన శిబిరం
- 'సేవా సంకల్ప్ అభియాన్'లో పాల్గొన్న బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు, నేతలు



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాక్షేత్రంలో 25 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న శుభసందర్భంగా, దేశవ్యాప్తంగా చేపట్టిన "సేవా సంకల్ప్ అభియాన్"లో భాగంగా భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో నాగోల్‌లో బుధవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) చంద్ర శేఖర్‌తో కలిసి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. 77వ వసంతంలోకి అడుగుపెట్టిన ప్రధాని మోదీ, గుజరాత్ ముఖ్యమంత్రిగా మరియు దేశ ప్రధానిగా గత 25 ఏళ్లుగా అందిస్తున్న సేవలు ప్రపంచ వ్యాప్తంగా భారత ప్రతిష్టను పెంచాయని కొనియాడారు. కులమతాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రజలందరూ ఆయన్ను గౌరవిస్తున్నారని పేర్కొన్నారు. దేశాన్ని మౌలిక వసతుల కల్పనలో స్వయంసమృద్ధి దిశగా నడిపిస్తున్నారని ఎంపీ తెలిపారు. మోడ్రన్ రైల్వే సిస్టమ్, అత్యాధునిక విమానాశ్రయాలు, వేలాది కిలోమీటర్ల జాతీయ రహదారుల నిర్మాణంతో దేశ రూపురేఖలు మా రి పో తు న్నా యన్నా రు . 2014 కంటే ముందు మౌలిక సదుపాయాలకు కేవలం రూ.2 లక్షల కోట్లు ఖర్చు చేస్తే, నేడు ఏకంగా రూ.15 లక్షల కోట్లు వెచ్చిస్తున్నారని వివరించారు. మోదీ తనను తాను ఎప్పుడూ 'పాలకుడిని' అని అనుకోలేదని, నిరంతరం ప్రజల 'సేవకుడిని' అని సగర్వంగా చాటుకున్నారని గుర్తుచేశారు. 76 ఏళ్ల వయస్సులోనూ ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా యంత్రంలా శ్రమిస్తున్న ప్రధాని మోదీ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసిన యువతకు, బిజెవైఎమ్ కార్యకర్తలకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు, బండ కార్తీక, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎన్. గౌతం రావు, తుళ్ల వీరేందర్ గౌడ్, బిజేవైయం రాష్ట్ర అధ్యక్షులు కుండే గణేష్, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ అధ్యక్షులు సామ రంగారెడ్డి, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.